## ప్రతినెల పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలి

అడ్డగుట్ట/రాంగోపాల్‌పేట్: ప్రతినెల చివరి రోజున పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, బీఎస్పీ సికింద్రాబాద్ అసెంబ్లీ అధ్యక్షుడు జోగు ఈశ్వర్ అన్నారు. ఈ మేరకు మారేడుపల్లి తహసీల్దార్ రాజునాయక్‌ను గురువారం వారు కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించాలన్నారు. ముందస్తుగా బస్తీ, కాలనీవాసులకు సమాచారం ఇచ్చి పౌరహక్కుల దినోత్సవాన్ని ప్రణాళికాబద్ధగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ పథకాలపై సైతం అవగాహన కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అదే విధంగా డీబీఎఫ్ హైదరాబాద్ కార్యదర్శి పులి కల్పన గురువారం సికింద్రాబాద్ తహసీల్దార్ పాండునాయక్‌కు వినతి పత్రం సమర్పించారు.

## మినిమం టైం స్కేల్‌ను వర్తింపజేయాలి

లాలాపేట: ఓయూ ఆర్ట్స్ కాలేజి నుంచి పాలనా భవనం వరకు గురువారం ఓయూలోని నాన్ టీచింగ్ కాంట్రాక్టు ఉద్యోగులు మహా ర్యాలీ నిర్వహించారు. పాలనా భవనం ప్రధాన గేటు ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు మాట్లాడుతూ... దీర్ఘకాలికంగా అతి తక్కువ వేతనాలతో పని చేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నామని అన్నారు. ఇప్పటికైనా తమ సేవలను గుర్తించి మినిమం టైం స్కేల్‌ను వర్తింపజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, యూనివర్సిటీ అధికారులను విజ్ఞప్తి చేశారు.

## ఆర్థిక, ఇంధన రంగాల మధ్య సమన్వయం ఉండాలి

సనత్‌నగర్: ఆర్థిక, ఇంధన రంగాల మధ్య సమన్వయంతోనే స్థిరమైన అభివృద్ధికి అవకాశం ఉంటుందని ప్రభుత్వ ఇంధన శాఖ ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ అన్నారు. బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో గురువారం రాష్ట్ర ఇంధన, ఆర్థిక సమావేశం–2025 నిర్వహించారు. 'తెలంగాణ ఇంధన ప్రకృతి దృశ్యం, విధానం, ఆచరణాత్మక సవాళ్లు'అనే అంశంపై జరిగిన చర్చాగోష్టిలో నవీన్ మిట్టల్ మాట్లాడారు. విద్యుత్, ఇంధన రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మకమైన చర్యలను తీసుకు వచ్చిందన్నారు. సెస్ చైర్‌పర్సన్ ప్రొఫెసర్ రేవతి మాట్లాడుతూ ఇంధన అవసరాలకు అనుగుణంగా తగిన కార్యాచరణ రూపొందించాలన్నారు. సంప్రదాయ, శుభ్రమైన ఇంధనాల వినియోగం పెరగాలని సూచించారు. సెంటర్ ఫర్ ఫైనాన్షియల్ అకౌంటబిలిటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జో అథియాలి మాట్లాడుతూ.. ఇంధన రంగంలో అవకాశాలను కల్పించేందుకు ఇలాంటి సమావేశాలు ఎంతగానో దోహదపడతాయన్నారు.

## యజమానులకు 20 ఫోన్లు అప్పగింత

రాంగోపాల్‌పేట్: దొంగిలించిన 20 ఫోన్లను మార్కెట్ పోలీసులు సీఐఈఆర్ పోర్టల్ ద్వారా మార్కెట్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గత కొద్ది రోజుల నుంచి వివిధ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్లు దొంగతనాలకు గురికాగా వాటిని ఈ పోర్టల్ ద్వారా పోలీసులు గుర్తించి ఆ ఫోన్లను రికవరీ చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రాంచందర్, డీఐ ఎస్ఎం బషీర్ అహ్మద్ తదితరులు బాధితులను పిలిపించి ఫోన్లు అప్పగించారు. దీంతో ఫోన్లు పోగొట్టుకున్న బాధితులు హర్షం వ్యక్తం చేశారు.

## గాంధీలో ఫార్మాసిస్ట్ డే

గాంధీఆస్పత్రి: ప్రపంచ ఫార్మాసిస్ట్‌ల దినోత్సవ వేడుకలు సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీ సూపరింటెండెంట్ ప్రొ. వాణి నేతృత్వంలో పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఫార్మాసిస్ట్‌లు అందిస్తున్న సేవలను అభినందించారు. తల్లీబిడ్డల సంరక్షణ కేంద్రం(ఎంసీహెచ్), పీడియాట్రిక్, ఆర్థోపెడిక్ తదితర విభాగాల్లో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు పంపిణీ చేశారు.


అన్నపూర్ణాదేవిగా ఉజ్జయినీ మహంకాళి


అన్నపూర్ణ దేవిగా బల్కంపేట ఎల్లమ్మ


లలితాదేవిగా రాజరాజేశ్వరీదేవి


హనుమాన్ దేవాలయంలో మంగళగౌరి అలంకరణలో


గాయత్రీదేవి అలంకరణలో ప్రకాష్‌నగర్ భూలక్ష్మి అమ్మవారు


ప్రత్యేక అలంకరణలో బేగంపేట శ్రీకట్టమైసమ్మ అమ్మవారు


అన్నపూర్ణ దేవిగా కనకదుర్గా దేవి


హనుమాన్ ఆలయంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

# అన్నపూర్ణ నమోస్తుతే.!

**అంగరంగ వైభవంగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు**


మేడిబావి పోచమ్మ కనకదుర్గ దేవాలయంలో మహా చండీయాగం


సీతాఫల్‌మండి ఉప్పలమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే పద్మారావుగౌడ్, కార్పొరేటర్ సామల హేమ


ఆర్యనగర్‌లో అమ్మవారి పూజలో పాల్గొన్న శ్రీకిషన్ శర్మ


బన్సీలాల్‌పేట్ ఆటో డ్రైవర్స్ యూనియన్ ఆధ్వర్యంలో

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో కనులపండువగా జరుగుతున్నాయి. గురువారం (నాల్గో రోజు) అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ బృందం

# 'డబుల్' ఇళ్ల పెండింగ్ పనులు పూర్తి చేయండి

**ఎమ్మెల్యే శ్రీగణేష్**

రాంగోపాల్‌పేట్: ఈనెల 27వ తేదీన రసూల్‌పూరా నారాయణ జోపిడి, సిల్వర్‌కాంపౌండ్‌లో డబుల్ బెడ్‌రూమ్‌లు లబ్ధిదారులకు పంపిణీ చేస్తుండటంతో పెండింగ్ పనులన్నీ పూర్తి చేయాలని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన డబుల్ బెడ్‌రూమ్‌లు పంపిణీ చేయనున్న సభా ప్రాంగణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారాయణజోపిడిలో 288, సిల్వర్‌కాంపౌండ్‌లో 40 ఇళ్లను లబ్ధిదారులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో అందిస్తామని చెప్పారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా, ట్రాఫిక్‌కు అవాంతరాలు లేకుండా పోలీసులు జాగ్రత్తలు చేపట్టాలని, ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో అతిథులకు, లబ్ధిదారులకు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్, నయిమ్, మల్లేష్, గౌస్, గఫార్ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న శ్రీగణేష్

**అధికారులతో సమీక్ష..**

ఈనెల 27వ తేదీన పంపిణీ చేయనున్న డబుల్ బెడ్ రూమ్‌లపై ఎమ్మెల్యే శ్రీగణేష్ గురువారం తన క్యాంపు కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆర్డీవో సాయిరాం, సికింద్రాబాద్, తిరుమలగిరి తహసీల్దార్లు పాండునాయక్, భిక్షపతి తదితర అధికారులతో సమీక్ష నిర్వహించి ఎలాంటి లోటుపాట్లు, పొరపాట్లు లేకుండా చూడాలని ఆయన ఆదేశించారు.

# మహిళలు శక్తి స్వరూపాలు


బేగంపేట పుష్పగిరి పీఠంలో సౌందర్య లహరి పారాయణంలో మహిళలు..


పీఠాధిపతులు శ్రీవిద్యాశంకర భారతి మహాస్వామి

సనత్‌నగర్: శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బేగంపేట పుష్పగిరి పీఠంలో శ్రీశ్రీశ్రీ జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతులు శ్రీవిద్యాశంకరభారతీ మహాస్వామి సమక్షంలో గురువారం పేరేపి విశాలక్ష్మి శిష్యబృందం 120 మంది మహిళలతో సౌందర్య లహరి పారాయణం చేశారు. ఈ సందర్భంగా స్వామిజీ మాట్లాడుతూ... శరన్నవరాత్రుల్లో లోక కల్యాణం కోసం, విశ్వవ్యాప్త శాంతి కోసం, సనాతన ధర్మ పరిరక్షణకు ప్రకృతిలో మూలశక్తి మహిళలేనని పేర్కొన్నారు. మహిళలు శక్తి స్వరూపాలు అన్నారు.

## రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: ముషీరాబాద్ రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన హోల్‌సేల్ చేపల వ్యాపారి గురువారం రైలుకిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. సికింద్రాబాద్ జీఆర్‌పీ హెడ్‌కానిస్టేబుల్ కే.కోటేశ్వర్‌రావు వివరాల మేరకు... చర్లపల్లి రైల్వే స్టేషన్ 4వ నెంబర్ ప్లాట్‌ఫామ్ పక్కన ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి మృతదేహం పడిఉన్నట్టు పోలీసులకు సమాచారం అందింది. ఘటన స్థలానికి వెళ్లిన పోలీసులు మృతుడు రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన చేపల వ్యాపారి సారారపు సతీష్‌కుమార్ (46)గా గుర్తించారు. రెండు రోజుల క్రితం సతీష్‌కుమార్ తన భార్య, ఇద్దరు పిల్లలతో మహబూబాబాద్ జిల్లాకు సమీప బంధువు మృతి చెందడంతో అంత్యక్రియకు హాజరయ్యేందుకు నగరం నుంచి బయలుదేరి వెళ్లాడు. కుటుంబ సభ్యులను అక్కడే వదిలేసిన సతీష్‌కుమార్ ఈనెల 24న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలులో మహబూబాబాద్ నుంచి బయలుదేరి చర్లపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నాడు. రైల్వేస్టేషన్ నాల్గో నెంబర్ వద్ద గల రైలు పట్టాలపై పడుకుని రైలుకింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీలకు అప్పగించారు.

## జీహెచ్‌ఎంసీ క్యాక్ ఇంజనీర్ ప్రకాశ్‌కు డాక్టరేట్



సికింద్రాబాద్: జీహెచ్‌ఎంసీ సికింద్రాబాద్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో క్యాక్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న బూక్య ప్రకాశ్‌కు ఓయూ అధికారులు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఓయూ సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొ. ఎంపీ కృష్ణారావు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా బూక్య ప్రకాశ్‌కు విశ్వవిద్యాలయం పరీక్షల విభాగం డాక్టరేట్ పట్టాను ప్రదానం చేసింది. భద్రాద్రి జిల్లా కొత్తగూడెం టౌన్‌కు చెందిన కిషన్, చంద్రి దంపతులకు కుమారుడు ప్రకాశ్. ఖమ్మంలో బీటెక్, మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఎంటెక్ పూర్తిచేశారు. జీహెచ్‌ఎంసీ క్యాక్ ఇంజనీర్‌గా సేవలు అందిస్తున్న ప్రకాశ్ డాక్టరేట్ పట్టా పొందిన సందర్భంగా జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, జోనల్ కమిషనర్ రవికిరణ్, చీఫ్ సిటీప్లానర్ శ్రీనివాస్, డీసీ ఆంజనేయులు, ఏసీపీ పావని అభినందించారు.

## పీహెచ్‌డీ కేటగిరి-2 ఫలితాలను విడుదల చేయాలి

లాలాపేట: ఎస్ఎఫ్ఐ ఓయూ కౌన్సిల్ ఆధ్వర్యంలో గురువారం ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్‌ను కలిసి పీహెచ్‌డీ కేటగిరి 2 ఫలితాలను విడుదల చేయాలనీ వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నేతలు మాట్లాడుతూ పీహెచ్‌డీ ఫలితాల విడుదలలో జరుగుతన్న తీవ్ర జాప్యంతో విద్యార్థులు ఆందోళనకు గురవుతున్నారనీ అన్నారు. విద్యార్థులకు దక్కాల్సిన ఫెలోషిప్‌లను సైతం కోల్పోతున్నారనీ వివరించారు. అధికారులు స్పందించి వెంటనే ఫలితాలను విడుదల చేయాలన్నారు.

## మహిళ చేతిలోని ఫోన్ లాక్కుని పరార్

**బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు**

అమీర్‌పేట: రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న మహిళ చేతిలోని సెల్‌ఫోన్ దుండగుడు లాక్కుని పారిపోయాడు. ఎస్ఆర్‌నగర్ ఇన్‌స్పెక్టర్ తెలిపిన వివరాల ప్రకారం... బల్కంపేటలో ఉంటున్న బి.అనిత బీకేగూడలోని ప్రింటింగ్ ప్రెస్‌లో పనిచేస్తుంది. గురువారం ఉదయం 9.30గంటల సమయంలో నడుచుకుంటూ డ్యూటీకి వెళ్తుండగా ఆమె వెనకాలే నడుచుకుంటూ వచ్చిన గుర్తు తెలియని అగంతకుడు చేతిలోని సెల్‌ఫోన్ లాక్కుని పారి పోయాడు. గమనించిన స్థానికులు వెంటపడి పట్టుకునేందుకు ప్రయత్నించినా దొరకలేదు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు.

# ప్రయాణికుల లగేజీ రక్షణకు ప్రత్యేక చర్యలు

సికింద్రాబాద్: రైల్వే ప్రయాణికులకు భద్రత కల్పించడంతో పాటు పోగొట్టుకున్న లగేజీలను అందులోని విలువైన వస్తువులను సంరక్షించి వారికి అందజేస్తున్నామని దక్షిణమధ్య రైల్వే ఆర్‌పీఎఫ్ సికింద్రాబాద్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అలకుంట నవీన్‌కుమార్ గురువారం చెప్పారు. ఆర్‌పీఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా ప్రత్యేక చర్యలు తీసుకుని పలువురు ప్రయాణికులు రైళ్లలో, రైల్వేస్టేషన్లలో మరిచిపోయిన లగేజీ బ్యాగులు, విలువైన వస్తువులు తిరిగి అప్పగిస్తున్నామని చెప్పారు. ఈ తరహా చర్యల్లో భాగంగా ఇప్పటి వరకు ప్రయాణికులకు ఈ ఏడాది ఇప్పటి వరకు రూ.1.8 కోట్ల విలువైన 703 వస్తువులను స్వాధీనం చేసుకుని ప్రయాణికులకు అందించామని చెప్పారు. రైల్వే ప్రయాణికులు అన్ని రకాల రక్షణ చర్యల కోసం 139 నెంబర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేయాలని ఆర్‌పీఎఫ్ ఎస్‌సీ నవీన్‌కుమార్ కోరారు.


ప్రయాణికురాలికి నగతు, బంగారు ఆభరణాలను అప్పగిస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసులు

# పేదలకు సేవలు అందించాలి


మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మేకల సారంగపాణి

సికింద్రాబాద్: బీజేపీ కార్యకర్తలు పండిట్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ ఆదర్శంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను పేదలకు అందించాలని మహంకాళి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి చెప్పారు. గురువారం సీతాఫల్‌మండి డివిజన్ అంబేడ్కర్ కూడలి వద్ద పండిత్ దీన్‌దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలు బీజేపీ నాయకులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మేకల సారంగపాణి మొక్కల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పేద ప్రజలకు సేవలు అందించి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు అందించడం ద్వారా ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వానికి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కనకట్ల హరి, ఆకారం రమేష్, అంబాల రాజేశ్వర్‌రావు, శ్యామ్, అజయ్‌నాయుడు, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# రూ.1.44కోట్ల కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

బౌద్ధనగర్: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను చేర్చిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానికే దక్కిందని సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ అన్నారు. సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం బౌద్ధనగర్ కమ్యూనిటీ హాల్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ముషీరాబాద్ మండలానికి సంబంధించిన 77 మందికి, మారేడుపల్లికి సంబంధించిన 67మందికి సుమారు రూ.1.44కోట్ల విలువ చేసే చెక్కులను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కంది శైలజ, సామల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మి, రాసూరి సునీత, తహసీల్దార్ చందన, రాజునాయక్ తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

# బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండగా సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో కనుల పండువగా జరుగుతున్నాయి. మహిళలు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చి ఆడిపాడారు. గాంధీఆస్పత్రి ప్రాంగణంలో బతుకమ్మ వేడుకలను గురువారం ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొ. వాణి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మ, విద్యావతి ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. పలు విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు ఆటపాటలతో సందడి చేశారు. దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంస్థ (హైదరాబాద్ డివిజన్) ఆధ్వర్యంలో గురువారం సికింద్రాబాద్‌లోని హైద్రాబాద్ భవన్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్షేమ సంస్థ అధ్యక్షురాలు ఆశావర్మ మాట్లాడుతూ... చిన్నా పెద్దా అనే తేడా లేకుండా భక్తిశ్రద్ధలతో పూలను పూజిస్తూ ఎంతో ఉత్సాహంగా జరుపుకునే పండగ బతుకమ్మ అని పేర్కొన్నారు.

– సికింద్రాబాద్, సనత్‌నగర్, కంటోన్మెంట్ జోన్ బృందం


బతుకమ్మలతో గాంధీ సూపరింటెండెంట్ ప్రొ. వాణి


గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళ సిబ్బంది


జెక్‌కాలనీ వాసవీ డ్రీమ్స్ వద్ద బతుకమ్మ వేడుకల్లో మహిళలు


హైదరాబాద్ భవన్‌లో బతుకమ్మ ఆడుతున్న దక్షిణ మధ్య రైల్వే మహిళా సంక్షేమ సంఘం సభ్యులు

# యువతకు స్ఫూర్తి పండిట్ దీన్ దయాళ్

పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను గురువారం సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ... ఒక పాత్రికేయుడిగా అప్పటి ప్రభుత్వ ద్వంద్వ విధానాలకు వ్యతిరేకంగా వ్యాసాలు రాసి ప్రజల మన్ననలను పొందిన వ్యక్తి దీన్ దయాళ్ అని అన్నారు. ఆయన ఆలోచనలు, సేవా తత్వం అందరికీ ఆదర్శప్రాయమన్నారు. ఆయన చూపిన మార్గం యువతలో స్ఫూర్తిని నింపుతుందన్నారు. ఈ సందర్భంగా నాయకులు పలు సేవా కార్యక్రమాలు చేశారు. అదే విధంగా దీన్ దయాళ్ జయంతిని పురస్కరించుకొని సేవా పఖ్వాడా, అంత్యోదయ దివస్‌ను నిర్వహించుకుని కాలనీలు, బస్తీలలో మొక్కలు నాటారు.

– సనత్‌నగర్, సికింద్రాబాద్, కంటోన్మెంట్ జోన్ బృందం



డాక్టర్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకల్లో మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, వెల్లాల రామ్మోహన్..


తుకారాంగేట్‌లో మొక్కలు నాటుతున్న బీజేపీ నేతలు


తార్నాక చింతల్‌లో జరిగిన వేడుకల్లో రాష్ట్ర బీజేపీ ఉపాధ్యక్షురాలు బండ కార్తీకచంద్రారెడ్డి


వారాసిగూడలో దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు